కళ తప్పిన పారిశ్రామికం

వరుస ఎన్నికలతో కొత్త పెట్టుబడులకు బ్రేక్

పరిశ్రమ వర్గాల విశ్వాసం చూరగొనడంలో ప్రభుత్వ వైఫల్యం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పారిశ్రామిక రంగంలో నిస్తేజం ఆవరించింది. కేసీఆర్ హయాంలో పెట్టుబడులతో కళ కళలాడిన రాష్ట్రం ప్రస్తుతం పూర్తిగా అచేతనావస్థకు చేరుకున్నది. కొత్త పారిశ్రామిక విధానం తెస్తామని, ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు జంకుతున్నారు. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడులను ఆకట్టుకోవడానికి కీలక నిర్ణయాలు తీసుకుంటుంటే.. అధికారంలోకి వచ్చి 4 నెలలైనా పారిశ్రామిక రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానంపట్ల స్పష్టత కొరవడింది. దీంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రతరమైంది. ఇక వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికలు, ఆ తర్వాత స్థానిక సంస్థల ఎలక్షన్లు జరగనుండటంతో మరికొంత కాలం పారిశ్రామిక రంగం పుంజుకునే అవకాశాలు లేవన్న అభిప్రాయాలున్నాయి. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో పలు పెట్టుబడులపై అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీనికితోడు నూతన ఎంఎస్ఎంఈ విధానాన్ని ప్రవేశపెడుతామని, చిన్నతరహా సంస్థలను ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు పలు రాయితీలనూ ఇస్తామని సీఎం ప్రకటించినా ఫలితం శూన్యం. ఫార్మాసిటీ అనుమతుల కోసం కేసీఆర్ సర్కార్ కేంద్రానికిచ్చిన ప్రతిపాదననూ నిలిపేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడం బెడిసికొట్టింది. నల్గొండ, వికారాబాద్, మెదక్‌లలో ఈ-ఫార్మా విలేజ్‌లను తెస్తామని స్వయంగా సీఎం ప్రకటించినప్పటికీ ఎటువంటి పురోగతి లేదు. దీంతో ఫార్మా రంగంలో నిస్తేజం ఆవరించింది.

గందరగోళంలో పారిశ్రామికవేత్తలు

కొత్త ప్రభుత్వంపై పారిశ్రామిక వర్గాల్లో విశ్వాసం కుదరడంలేదనే వాదన బలంగా వినిపిస్తున్నది. అధికార పార్టీ నేతల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలే దీనికి కారణమని, ప్రభుత్వ మనుగడ ఎలా ఉంటుందనేది పార్లమెంటు ఎన్నికలయ్యాకే తెలుస్తుందని పలువురు చెప్తున్నారు. కాంగ్రెస్ గెలిచే స్థానాలే కీలకమంటున్నారు. హామీల అమలులో విఫలం కావడంతో ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైంది. నిజానికి రాష్ట్ర విభజన తర్వాత చాలామంది పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వెళ్లి భూములు కొన్నా.. తెలంగాణలో కేసీఆర్ సర్కారు అమలు చేస్తున్న విధానాలు, నిరంతర విద్యుత్తు సరఫరాకు ఆకర్షితులై రాష్ట్రానికి తరలివచ్చారు.

పారిశ్రామికంపై దృష్టి సారించని సర్కార్..

అధికారంలోకి వచ్చి 4 నెలలైనా ప్రభుత్వం పారిశ్రామిక రంగంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. సీఎం, పరిశ్రమల శాఖ మంత్రి విడివిడిగా పారిశ్రామికవేత్తలతో సమావేశమైనా ఫలితం లేకపోయింది. కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్తు, పారిశ్రామిక అనుకూల విధానాలను ప్రవేశపెట్టారు. దీంతో పదేండ్లలో సుమారు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులు, దాదాపు 20 లక్షల ఉద్యోగావకాశాలు లభించాయి. మొత్తమ్మీద రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు పారిశ్రామికరంగానికి ఓ కుదుపుగా చెప్పడంలో సందేహంలేదని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి.

పెరగనున్న ఆడీ కార్ల ధరలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ.. అన్ని రకాల మాడళ్ల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు జూన్ నుంచి అమలులోకి రానున్నాయి. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు రవాణా కోసం అధికంగా నిధులు వెచ్చించాల్సి వస్తున్నదని, దీంతో వాహన ధరలు పెంచకతప్పడం లేదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 7 వేల యూనిట్ల వాహనాలను విక్రయించింది.

యాక్సెస్ మెడిటెక్‌లో ఉద్యోగాలు

హైదరాబాద్, ఏప్రిల్ 25: బీమా టెక్ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన యాక్సెస్ మెడిటెక్ భారీగా ఉద్యోగులను తీసుకోనున్నట్లు ప్రకటించింది. సంస్థ 17వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో కంపెనీ సీఈవో సయ్యద్ ఐజాజుద్దీన్ మాట్లాడుతూ..ఈ ఏడాది చివరిలోగా 30 శాతం నుంచి 40 శాతం వరకు ఉద్యోగులను పెంచుకోనున్నట్లు ప్రకటించారు. కొత్త మార్కెట్లు, కొత్త ఆవిష్కరణలే ఏజెండాగా పనిచేస్తున్న సంస్థ.. ఇందుకోసం నూతన టెక్నాలజీ నిపుణులను రిక్రూట్ చేసుకోనున్నట్లు తెలిపారు.

ఒలెక్ట్రా రికార్డు లాభం

హైదరాబాద్, ఏప్రిల్ 25: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.76.83 కోట్ల రికార్డు నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది నమోదైన లాభం కంటే 17.1 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.8 శాతం ఎగబాకి రూ.1,154.14 కోట్లకు చేరుకున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 8,232 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్ లభించినట్లు, దీంతో ఇప్పటి వరకు 10 వేలకు పైగా ఆర్డర్లు లభించినట్లు అయింది.

దివీస్ ల్యాబ్ 700 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: హైదరాబాద్‌కు చెందిన దివీస్ ల్యాబ్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి రూ.700 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నది. కస్టమర్ల అవసరాల మేరకు మరో ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌కు సమీపంలోని ప్లాంట్‌తోపాటు వైజాగ్‌లో ఉత్పత్తి కేంద్రాలు ఉండగా..వీటితోపాటు కాకినాడ వద్ద యూనిట్‌ను నెలకొల్పడానికి ఇప్పటికే భూమిని కొనుగోలు చేసింది. దీర్ఘకాలికంగా కస్టమర్లతో పలు ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థ..అందుకు తగ్గట్టుగానే ప్రణాళికలను వేగవంతం చేసింది. దీంట్లో భాగంగా కొత్తగా రూ.650 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయబోతున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ నిధులను అంతర్గత వనరుల ద్వారా సేకరించనున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. కాకినాడ ప్లాంట్ జనవరి 2027 నాటికి అందుబాటులోకి రావచ్చునని వెల్లడించింది.

సైయెంట్ లాభం 189 కోట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 25: గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ.1,861 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.189 కోట్ల నికర లాభాన్ని గడించింది ప్రముఖ టెక్నాలజీ సంస్థ సైయెంట్. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయంతో పోలిస్తే 6.3 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, నికర లాభంలో 16 శాతం పెరుగుదల కనిపించింది. మొత్తం ఆదాయంలో డిజిటల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ రంగాల నుంచి 80 శాతం సమకూరాయి. ప్రస్తుతం 902 మిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని, ఇంజినీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ ఎండీ కృష్ణ బొడనపు తెలిపారు. గతేడాదికి గాను రూ.30 డివిడెండ్‌ను ప్రకటించింది.

అడ్రస్ మారిన 17వేల క్రెడిట్ కార్డులు

ప్రకటించిన ఐసీఐసీఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఇటీవల జారీ చేసిన దాదాపు 17,000 కొత్త క్రెడిట్ కార్డులు వివిధ డిజిటల్ పద్ధతుల్లో పొరపాటున ఒకరికి బదులు మరొకరి చేతికి వెళ్లాయని ఐసీఐసీఐ బ్యాంక్ గురువారం ప్రకటించింది. అయినప్పటికీ ఈ తప్పు వల్ల ఎటువంటి దుర్వినియోగం జరుగలేదన్న బ్యాంక్.. ఒకవేళ ఏదైనా ఆర్థిక నష్టం జరిగితే బాధిత కస్టమర్లకు దాన్ని పరిహారంగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కాగా, కొత్త క్రెడిట్ కార్డులను వాడాలంటే కస్టమర్ల మొబైల్స్‌కు వచ్చే వన్-టైమ్ పాస్‌వర్డ్‌లు కీలకమని, కావున కార్డుల దుర్వినియోగం జరగడానికి చాలాచాలా తక్కువ వీలుందని నిపుణులు చెప్తున్నారు. మరోవైపు ఈ కార్డులన్నింటినీ ఇప్పటికే బ్లాక్ చేశామంటున్న ఐసీఐసీఐ బ్యాంక్.. తప్పుగా పంపిణీ అయిన కార్డులను తిరిగి వెనక్కి తీసుకోవడం వీలు కానందున, అసలు కస్టమర్లకు త్వరలోనే కొత్త కార్డులు వస్తాయన్నది. అయితే బుధవారం సాయం త్రం నుంచే ఈ వ్యవహారం.. పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండగా, దాన్నిప్పుడు బ్యాంక్ ధ్రువీకరించడం గమనార్హం. మరోవైపు ఈ తరహా నిర్లక్ష్యం మూలంగానే కొటక్ బ్యాంక్‌పై ఆర్బీఐ కొరడా ఝుళిపించిన నేపథ్యంలో ఇప్పుడు ఐసీఐసీఐ హాట్ టాపికైంది.

404 లక్షల కోట్లకు బీఎస్ఈ మార్కెట్ క్యాప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.404.18 లక్షల కోట్లకు చేరింది. వరుస లాభాల నడుమ గడిచిన 5 రోజుల్లో మదుపరుల సంపద రూ.11.29 లక్షల కోట్లు ఎగిసింది. గురువారం 486.50 పాయింట్లు పుంజుకొని బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 74,339.44 వద్ద స్థిరపడింది. ఐదు రోజుల్లో సూచీ 1,850.45 పాయింట్లు లేదా 2.55 శాతం ఎగబాకడం విశేషం. ఈ క్రమంలోనే మార్కెట్ క్యాప్ రూ.11,29,363.01 కోట్లు అందుకుని రూ.4,04,18,411.32 కోట్లకు వెళ్లింది. ఇదిలావుంటే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 167.95 పాయింట్లు పెరిగి 22,570.35 వద్ద నిలిచింది.

క్రెడిట్ కార్డుల హవా

లావాదేవీల్లో నయా రికార్డు • మార్చిలో రూ. 1.65 లక్షల కోట్లు

ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ కనిపిస్తున్న జోరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: క్రెడిట్ కార్డు ఆధారిత లావాదేవీలు రికార్డు స్థాయికి చేరాయి. గత నెలలో నిరుడుతో పోల్చితే 20 శాతం పుంజుకున్నాయి. అంతకుముందు నెల ఫిబ్రవరితో చూస్తే 10 శాతం పెరిగాయి. ఈ క్రమంలోనే ఆన్‌లైన్‌లో నెలవారీ క్రెడిట్ కార్డుల వినియోగం తొలిసారి లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. ఈ ఏడాది మార్చిలో రూ.1,04,081 కోట్లుగా ఉన్నది మరి. ఫిబ్రవరిలో ఇది రూ.94,774 కోట్లుగా ఉంటే, గత ఏడాది మార్చిలో రూ.86,390 కోట్లుగానే ఉన్నది. ఇక ఆఫ్‌లైన్‌లోనూ క్రెడిట్ కార్డు లావాదేవీలు (పాయింట్ ఆఫ్ సేల్-పీవోఎస్) 20 శాతం ఎగిశాయి. గత నెల రూ.60,505 కోట్లుగా ఉన్నాయి. క్రిందటి ఏడాది మార్చిలో ఇవి రూ.50,920 కోట్లు. ఈ ఫిబ్రవరిలో రూ.54,431.48 కోట్లుగా ఉన్నాయి. దీంతో అటు ఆన్‌లైన్, ఇటు ఆఫ్‌లైన్‌లలో క్రెడిట్ కార్డు ద్వారా జరిగిన లావాదేవీల విలువ ఈ మార్చిలో ఏకంగా రూ.1,64,586 కోట్లుగా నమోదైంది. ఏడాది క్రిందట ఇదే నెలలో రూ.1,37,310 కోట్లే. ఈ ఫిబ్రవరిలో మాత్రం రూ.1,49,205 కోట్లుగా ఉన్నది.

హెచ్‌డీఎఫ్‌సీ టాప్

క్రెడిట్ కార్డ్ మార్కెట్‌లో దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్‌లో ఉన్నది. ఈ మార్చి ఆఖరు నాటికి 20.2 శాతం వాటా దీనిదే. ఆ తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ 18.6 శాతంతో రెండో స్థానంలో ఉన్నది. మూడో స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ కొనసాగుతున్నది. ఇక నిరుడు మార్చితో పోల్చితే ఈ ఏడాది మార్చిలో క్రెడిట్ కార్డు వినియోగదారులూ పెరిగారు. దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్య 20 శాతం ఎగబాకి 10.1 కోట్లకు చేరింది. ఫిబ్రవరిలో మొదటిసారి 10 కోట్ల మార్కును దాటింది. నిరుడు మార్చిలో 8.5 కోట్ల క్రెడిట్ కార్డులే ఉండగా, ఏడాది కాలంలో దాదాపు 1.5 కోట్లకుపైగా పెరుగడం గమనార్హం. ఇక క్రెడిట్ కార్డ్ మార్కెట్‌లో 90 శాతం వాటా.. వాటిని పెద్ద ఎత్తున జారీ చేస్తున్న టాప్-10 బ్యాంకులదే.

క్రెడిట్ కార్డుల మార్కెట్‌లో బ్యాంకుల వాటా



- ఈ ఏడాది మార్చిలో క్రెడిట్ కార్డు ద్వారా జరిగిన లావాదేవీల్లో ఆఫ్‌లైన్ 18 కోట్లు, ఆన్‌లైన్ 16.4 కోట్లు. నిరుడుతో పోల్చితే 28 శాతం, 33 శాతం చొప్పున పెరిగాయి. చిన్నచిన్న లావాదేవీలకూ క్రెడిట్ కార్డులను వాడుతున్నవారు పెరగడమే ఇందుకు కారణం.
- గత నెల స్టోర్ల (ఆఫ్‌లైన్)లో 30 శాతం పడిపోయిన డెబిట్ కార్డు ఆధారిత లావాదేవీలు. 11.6 కోట్లకు పరిమితం. ఆన్‌లైన్‌లోనూ 41 శాతం బిగి 4.3 కోట్లకు తగ్గుదల. విలువ ప్రకారం చూస్తే వరుసగా రూ.29,309 కోట్లు, రూ.15,213 కోట్లుగా ఉన్నాయి. 17 శాతం మేర క్షీణించాయి.
- ఆర్బీఐ వివరాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా దేశంలో జరిగిన లావాదేవీల విలువ రూ.18.3 లక్షల కోట్లుగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) దాదాపు రూ.14 లక్షల కోట్లే.

యానిమేషన్‌లో కల్కి ప్రపంచం

'దర్శకుడు నాగ్‌అశ్విన్ ప్రేక్షకులకు కొత్త ప్రపంచం చూపించబోతున్నాడు. కొత్త పాత్రలను పరిచయం చేయబోతున్నాడు. 'కల్కి 2898' ఇండియన్ స్క్రీన్‌పై ముందెన్నడూ చూడని అద్భుతం'. అని ఆ సినిమాకు పనిచేసిన వాళ్లు చెబుతున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న ఈ చిత్రంలో దీపిక పదుకొణే కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దుల్కర్ సల్మాన్‌లతోపాటు మరికొందరు స్టార్లు కూడా ఈ సినిమాలో భాగమైన విషయం తెలిసిందే. 'కల్కి 2898' ప్రభాస్ కెరీర్‌లోనే హైబడ్జెట్ సినిమా. శ్రీమద్భాగవతంలో ప్రస్తావించిన ఓ అంశం ఆధారంగా పురాణపాత్రల నేపథ్యంలో జరిగే ఫాంటసీ, సైంటిఫిక్ థ్రిల్లర్ ఇది. రీసెంట్‌గా ద్రోణసుతుడైన అశ్వద్ధామగా అమితాబ్‌ను మేకర్స్ పరిచయం చేశారు. వందేళ్ల తర్వాతి ప్రపంచరూపం, పరిణామాలూ, పోకడలూ ఇందులో కొత్తగా అనిపిస్తాయని తెలుస్తున్నది. ఈ సినిమా విడుదల తేదీపై ప్రేక్షకుల్లో సందిగ్ధత నెలకొని ఉన్న విషయం తెలిసిందే. మే 9న విడుదల చేయనున్నట్టు వైజయంతీ మూవీస్ సంస్థ కొన్ని నెలల క్రితం ప్రకటించింది. అయితే.. ఆ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వేడి తారాస్థాయిలో ఉంటుంది. అందుకే.. సినిమా విడుదలపై నిర్మాతలు పునరాలోచనలో పడ్డట్టు సమాచారం. త్వరలోనే కొత్త డేట్‌ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. కాగా, విడుదలకు ముందే, ఈ సినిమాపై ఓ యానిమేషన్ వీడియోను వైజయంతీ మూవీస్ సంస్థ సిద్ధం చేస్తున్నదట. ఆ వీడియో ద్వారా 'కల్కి 2898' ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్టు వినికిడి. ఇది ఏ తరహా సినిమానో ఆ వీడియోలో చూపించి, ప్రేక్షకులకు ప్రిపేర్ చేయడమే ఈ వీడియో ముఖ్యోద్దేశమట. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ఈ వీడియోతో అవి మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

చిత్రం

ఆ సీన్ ఇబ్బంది పెట్టింది

నటిగా లొకేషన్‌లో ఇబ్బందిపడ్డ సందర్భం ఏమైనా ఉందా? అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు మృణాళ్‌ఠాకూర్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చింది. మృణాల్ అభిమాన నటుడు షాహిద్ కపూర్. ఆయనతో కలిసి నటించిన 'జెర్సీ' చిత్రం నాటి ఆన్ లొకేషన్ ఎక్స్‌పీరియన్స్‌ని మీడియా ముందు నెమరువేసుకుంది మృణాళ్. 'నాకు షాహిద్ అంటే పిచ్చి. అలాంటి నాకు వరంగా వచ్చింది 'జర్సీ' ఆఫర్. సంబరపడిపోతూ సైన్ చేశాను. నాకు షాహిద్ నవ్వు అంటే చాలా ఇష్టం. లొకేషన్లో ఆయన నవ్వుతుంటే అలాగే చూస్తూవుండేదాన్ని. ఆయన నావైపు చూసి, ఏంటలా చూస్తున్నావ్? అనడిగారు. 'సినిమాల్లోనే కాదు, రియల్‌గా కూడా మీ నవ్వు చాలా బావుంది' అని చెప్పేశాను. ఆయన నవ్వుకున్నారు. షాహిద్‌తో నటించిన రోజుల్ని జీవితంలో మరిచిపోలేను. అదే లొకేషన్‌లో నేను ఇబ్బంది పడ్డ సందర్భం కూడా ఒకటుంది. కథ రీత్యా నేను షాహిద్‌ని చెంపదెబ్బ కొట్టాలి. తనేమో నా అభిమాన నటుడు. ఆయన్ని కొట్టడం అంటే అంతకంటే శిక్ష వేరొకటి ఉండదు. కానీ కథలో కీలకమైన సీన్.. తప్పదు. అందుకే.. నిదానంగా కొడతాను.. మీరు ఎడిట్ చేసుకోండి అని దర్శకుడు గౌతమ్ తిన్ననూరికి చెప్పాను. ఆయన ఒప్పులేదు. గట్టిగా కొట్టాల్సిందే అన్నారు. షాహిద్ కూడా కొట్టమని బలవంతపెట్టాడు. పైగా 'నీ ఎక్స్ బాయ్‌ఫ్రెండ్‌ను గుర్తుచేసుకో.. గట్టిగా కొట్టెయ్..' అంటూ మోటివేట్ చేశాడు. ఆ ఒక్క సీన్ చేయడానికి మూడు గంటలు పట్టింది.

'సితారే జమీన్ పర్' కోసం

స్వీయ దర్శకత్వంలో అమీర్‌ఖాన్ నటించిన 'తారే జమీన్ పర్' (2007) చిత్రం బాక్సాఫీస్ వద్ద చక్కటి విజయాన్ని సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలందుకొంది. ప్రత్యేకమైన మానసిక సమస్యలతో బాధపడుతున్న పిల్లల పట్ల ప్రేమపూర్వక వైఖరి అనుసరిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీయాలనే స్ఫూర్తివంతమైన కథాంశంతో అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. ఇదే తరహా ఇతివృత్తంతో అమీర్‌ఖాన్ తాజాగా 'సితారే జమీన్ పర్' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాడు. వచ్చే నెలలో ఢిల్లీలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. అమీర్‌ఖాన్‌తో పాటు పదకొండు మంది పిల్లలు ఈ సినిమాలో నటించబోతున్నారు. 'పారా ఒలింపిక్స్ నేపథ్యంలో సాగే కథ ఇది. మానసిక, శారీరక లోపాలతో ఉన్న పిల్లలకు ఉత్తమ శిక్షణ అందించి, వారిలో ధైర్యాన్ని ప్రోది చేసే మార్గదర్శి పాత్రలో అమీర్‌ఖాన్ కనిపిస్తాడు. 'తారే జమీన్ పర్' తరహాలోనే చిన్నారుల్లో స్ఫూర్తినింపే కథాంశమిది' అని చిత్ర బృందం పేర్కొంది.

పాటల్లేకుండా సినిమా

కమర్షియల్ సినిమాల్లో పాటలు తప్పనిసరి. గతంతో పోల్చితే నేటి సినిమాల్లో పాటల సంఖ్యను తగ్గించారు. పూర్తిగా పాటలు లేకుండా సినిమాలు తీయడం చాలా అరుదు. అలాంటి అరుదైన ప్రయత్నమే చేయనున్నారు అగ్ర హీరో విజయ్ దేవరకొండ. అసలు పాటలే లేకుండా సినిమా చేయనున్నారాయన. వివరాల్లోకి వెళితే.. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో తీస్తున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ గూఢచారి పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. అయితే ఈ సినిమాలో కథానుగుణంగా పాటల అవసరం లేదట. కేవలం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మాత్రమే ఉంటుందట. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్. ఆయన ట్యూన్స్‌కు సంగీతప్రియుల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. అలాంటి మ్యూజిషియన్ పాటలు లేకుండా సినిమా చేయడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. కథ తాలూకు ఎమోషన్‌ను డిస్టర్బ్ చేయకూడదనే ఉద్దేశ్యంతో పాటలు వొద్దనుకున్నారని అంటున్నారు. అక్కడక్కడా బిట్‌సాంగ్స్ వినిపిస్తాయని, ప్రత్యేకంగా పాటలు మాత్రం ఉండవని చెబుతున్నారు. శుక్రవారం నుంచి ఈ సినిమా తాజా షెడ్యూల్ విశాఖపట్నంలో మొదలుకానుంది.

తమన్నాపై కేసు నమోదు

అగ్ర కథానాయిక తమన్నాపై మహారాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివాదాస్పద ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ మహాదేవ్‌కు అనుబంధ యాప్‌గా ఉన్న ఫెయిర్ ప్లే కోసం తమన్నా ప్రచార కర్తగా పనిచేసింది. ఈ యాప్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ అధికారిక బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ జియో సినిమా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి తమన్నాపై ఫిర్యాదు చేసింది. ఫెయిర్ ప్లే యాప్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూడమని తమన్నా చెప్పడం నిబంధనలకు విరుద్ధమని జియో సినిమా తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కంప్లైంట్‌ను స్వీకరించిన ముంబయి సైబర్ పోలీసులు వచ్చే వారం విచారణకు హాజరుకావాలని తమన్నాకు సమన్లు జారీ చేశారు. మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌పై గత కొంతకాలంగా వివాదం నడుస్తున్నది. ఈ యాప్ వ్యవహారాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసి దర్యాప్తుని నిర్వహిస్తున్నది. ఈ యాప్ కోసం ప్రచారం నిర్వహించిన రణ్‌బీర్‌కపూర్, శ్రద్ధాకపూర్‌కు ఈడీ గతంలోనే సమన్లు జారీ చేసి విచారణ చేపట్టింది. తాజాగా తమన్నాపై కేసు నమోదు కావడం ఆసక్తికరంగా మారింది.

కడుపుబ్బా నవ్విస్తుంది

'పెళ్లి అనేది అందరూ రిలేట్ చేసుకునే అంశం. అలాగే ఈ కథలో కామెడీతోపాటు ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా చాలా ఉన్నాయి. అందుకే దీన్నే మా తొలి సినిమా కథగా ఎంపిక చేసుకున్నాం.' అని రాజీవ్ చిలక అన్నారు. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత రాజీవ్ చిలక గురువారం విలేకరులతో ముచ్చటించారు. 'పెళ్లి ఆలస్యమవుతుండటంతో డిప్రషన్‌లోకి వెళ్లిపోతుంటారు కొందరు. ఈ రోజుల్లో ఆర్థికంగా సెటిల్ అవ్వడం కంటే, పెళ్లి అవ్వడం పెద్ద టాస్క్. ఒకప్పుడు చుట్టాలూ, పక్కాలు అందరూ కలిసి సంబంధాలు సెట్ చేసేవారు. ఇప్పుడు వేరే రాష్ట్రంలోనో వేరే దేశంలోనో ఉంటూ, పెళ్లికోసం వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. వాటిపైనే ఆధారపడిపోతున్నారు. మ్యాట్రిమొనీ సైట్స్ ద్వారా ప్రస్తుతం లక్షల పెళ్లిల్లు జరుగుతున్నాయి. అలా ఒక్కటైన జంటల్లో చాలామందికి ఒకరి గురించి ఒకరికి తెలీదు. ఈ నేపథ్యంలో హ్యూమర్, ఎమోషన్స్ నడుమ సాగే మంచి కథ ఇది' అని తెలిపారు చిలక రాజీవ్. 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్‌ని నరేశే సూచించారనీ, పెళ్లి అవ్వక బాధపడుతున్న హీరోను, పెళ్లెప్పుడని అందరూ అడుగుతుంటే.. సహజంగా పలికే డైలాగ్ 'ఆ ఒక్కటీ అడక్కు' అనీ. ఈ కథకు ఈ టైటిల్ యాప్ట్ అనీ, పైగా నరేశ్‌గారి నాన్నగారి సూపర్‌హిట్ సినిమా టైటిల్ కావడంతో ఆ సెంటిమెంట్ కూడా కలిసొచ్చిందని చిలక చెప్పారు.

STONE BENCH FILMS
PURATCHI THALAPATHY
VISHAL
IN
రత్నం
STORY - SCREENPLAY - DIALOGUE - DIRECTION
HARI
DEVI SRI PRASAD
M.SUKUMAR T.S.JAY
KAL RAMAN - S SOMASEGAR - KALYAN SUBRAMANIAM